


రామాలయానికి విరాళం

ఉప్పలగుప్తం: మండలంలోని పేరాయిచెరువులో రామాలయ నిర్మాణానికి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచే రమణారావు శనివారం రూ.25 వేల విరాళాన్ని అందించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2000 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
44.5° / 27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.5	30.0
కాకినాడ	41.9	30.1
అమలాపురం	40.0	27.0

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మృతి చెందిన చిటికెల వరహాలబాబు

యలమంచిలి (అనకాపల్లి జిల్లా) : ట్రాక్టర్‌ను ఐషర్ వ్యాన్ ఢీన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం గ్రామం హైవే రోడ్డుపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన చిటికెల వరహాలబాబు (47)మృతి చెందారన్నారు. కోటనందూరు నుంచి కర్రల లోడుతో అచ్చుతాపురం వెళుతున్న ట్రాక్టర్‌ను తుని నుంచి అతివేగంగా వచ్చిన వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ పక్కన ఉన్న చిటికెల వరహాలబాబు జారి పడి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు కుమారుడు చిటికెల సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

ఏలేశ్వరం: బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం విక్టర్‌ప్రసాద్ కోరారు. స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్‌హాలులో శనివారం దళిత మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి మార్గనిర్దేశం చేసిన వ్యక్తిగా బీఆర్ అంబేడ్కర్ ప్రత్యేస్థానం పొందారన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా హక్కులు కల్పించిన మహనీయుడు అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎస్సీలపై దాడులు జరిగితే ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందన్నారు. దళితులు ఆత్మగౌరవంతో జీవించేలా చేసిన అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించాలన్నారు. తొలుత స్థానిక పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

ఆపద వేళ.. ఆర్థిక భరోసా

- నిరుపేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా
- రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- రైస్ కార్డుదారులందరూ బీమాకు అర్హులే
- ఇప్పటికే 70శాతం దాటిన నమోదు ప్రక్రియ



వైఎస్సార్ బీమా నమోదు చేస్తున్న వలంటీర్

- కాకినాడ రూరల్ మండలం వాకలపూడి చెందిన చిన్నారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అతనికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. చిన్నారావు చనిపోవడంతో కుటుంబం నిరాధారమైంది. కనీస బీమా లేకపోవడంతో ఒక్క రూపాయి కూడా కుటుంబానికి దక్కలేదు.
- పిఠాపురానికి చెందిన వరప్రసాద్ కూలిపనితో కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఇతని మరణంతో కుటుంబం దిక్కులేనిదైంది. ఎలాంటి బీమా లేకపోవడంతో కుటుంబానికి పైసా వచ్చే దారి లేదు.
- ఈ రెండు కుటుంబాలే కాదు. జిల్లాలో చాలా మంది ఇలాంటి సంఘటనల్లో అనాథలవుతున్నారు. ఇలాంటి వారి పక్షాన బీమా చెల్లించి భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం నిర్ణయించింది. వైఎస్సార్ బీమా పథకం ప్రవేశపెట్టి ఆదుకుంటోంది.

కాకినాడ సిటీ: కుటుంబ భద్రతలో భాగంగా ప్రస్తుతం ప్రతి ఒక్కరూ జీవిత బీమాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆదాయ వర్గాలు ఏదో బీమా పాలసీలు చేస్తుకుంటున్నాయి. పేదలు మాత్రం కనీస బీమా లేక భద్రత లేకుండా బతుకుతున్నారు. ఈ క్రమంలో పేద కుటుంబాలకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ల క్రితం వైఎస్సార్ బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాది క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రైస్ కార్డుదారు కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారు. వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లకు నివేదిస్తున్నారు. వారు వివరాలు నమోదు చేసుకుని అర్హులను ఎంపిక చేస్తున్నారు. బియ్యం కార్డు కలిగిన కుటుంబ యజమాని పేరిట బీమా చేస్తున్నారు. ప్రీమియం చెల్లింపు బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటోంది.

70శాతానికి పైగా నమోదు

బీమా పథకాన్ని వైఎస్సార్ క్రాంతి పథం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. జిల్లాలో 5,83,107 మంది రైస్ కార్డుదారులు ఉన్నారు. ఈనెల 10వతేదీ నాటికి 4,13,746 మంది వివరాలు సేకరించారు. అంటే 70.46 శాతం నమోదు చేశారు. ఈనెల 10వతేదీ చివర గడువు విధించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఈ నెల 13 వరకు గడువు పొడిగించారు. బీమా నమోదు కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో సర్వే వేగంగా నిర్వహిస్తున్నారు. 385 గ్రామ పంచాయతీల పరిధిలోని 620 సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్, కార్యదర్శుల పర్యవేక్షణలో సర్వే జరుగుతోంది.

గత ఏడాది క్లెయిముల వివరాలు

నమోదైన క్లెయిములు	:	1217
ప్రాసెస్ చేసినవి	:	1198
మంజూరు చేసినవి	:	713
సాధారణ మరణాలు (631 క్లెయిములు)	:	రూ.6.31 కోట్లు
ప్రమాద మరణాలు (82 క్లెయిములు)	:	రూ.4.10 కోట్లు

ప్రయోజనాలు ఇలా

వైఎస్సార్ బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్ల లోపు వయస్సు కలిగిన రైస్ కార్డు లబ్ధిదారులు అర్హులు. వీరు 18 నుంచి 50 ఏళ్ల మధ్య సహజ మరణం పొందితే నామినీకి రూ.1 లక్ష బీమా మొత్తం వస్తుంది. ప్రమాదవశాత్తూ మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.5లక్షల బీమా లభిస్తుంది. 51 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన లబ్ధిదారులు ప్రమాదంలో మరణించినా లేక పూర్తి అంగవైకల్యం కలిగినా రూ.5 లక్షల బీమాను వారసులకు చెల్లిస్తారు.

పథకానికి అర్హతలివీ..

- బియ్యం కార్డుదారుడై ఉండాలి. ఇంటిలో సంపాదించే వ్యక్తికి బీమా లభిస్తుంది. భార్య పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు నామినీగా ఉంటారు.
- భర్త చనిపోయిన చోట ఆయన భార్యే కుటుంబాన్ని పోషిస్తే భార్య పేరున బీమా ఉంటుంది. పిల్లలు, వృద్ధులు నామినీగా ఉంటారు.
- ఉమ్మడి కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు కుటుంబ పోషకాలున్నంటే వారిలో పోషించే వ్యక్తిని ఆ కుటుంబం నిర్ణయించుకుంటుంది.
- గ్రామీణ ప్రాంతాల్లోని వారి నెలకు ఆదాయం రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లోని వారి ఆదాయం నెలకు రూ. 12వేలు ఉండాలి.
- వయసు 18 నుంచి 70 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
- మాగాణి భూమి మూడెకరాలు లేదా మెట్టభూమి పదెకరాల కన్నా తక్కువ ఉన్నవారు అర్హులు.
- పాలసీదారులకు గుర్తింపు కార్డును ప్రభుత్వం విడుదల చేస్తుంది.

వేగంగా నమోదుకు చర్యలు



వైఎస్సార్‌బీమా పథకానికి అర్హులైన బియ్యం కార్డుదారులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సచివాలయ వలంటీర్లు చేస్తున్నారు. ప్రభుత్వమే మొత్తం ప్రీమియం చెల్లిస్తుంది. బీమాకు అర్హులైన వారి బ్యాంకు ఖాతాల్లోనే ప్రభుత్వం నేరుగా నగదును జమ చేస్తుంది. అర్హులంతా వలంటీర్లను కలిసి బీమా నమోదు చేసుకోవాలని కోరుతున్నాం.

– కె శ్రీరమణి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, కాకినాడ జిల్లా.

మండుతున్న ఎండ అటు భక్తులతో కొండ

కిక్కిరిసిన రత్నగిరి ఆలయ ప్రాంగణం



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరిపై శనివారం తీవ్ర రద్దీ నెలకొంది. ఇటీవల కాలంలో ఇంత పెద్ద సంఖ్యలో స్వామివారి సన్నిధికి భక్తులు రాలేదు. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరిగాయి. అదే సమయంలో పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు మరో వేయి మంది తమ బంధుమిత్రులతో కలిసి సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించారు. వ్రతమండపాలు, క్యూ లైన్లు, స్వామివారి ఆలయం భక్తులు, నవదంపతులతో నిండిపోయాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు ఐదు వేలు జరిగాయి. సుమారు 70 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.70 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదానపథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

ఎండ ప్రభావాన్ని తట్టుకుని..

సుమారు 42 డిగ్రీల ఉష్ణోగత, దానికి తోడు వేడెక్కిన కొండ ప్రాంతం, అంచనాకు మించి ఒకేసారి వచ్చిన భక్తజనంతో శనివారం రత్నగిరిపై భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఏడు గంటల వరకూ దేవస్థానంలో రద్దీ తక్కువగానే ఉంది. ఏడు గంటల నుంచి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన నవదంపతులు, ఇతర భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వ్రతమండపాల వద్ద వేలాది మంది క్యూ కట్టారు. స్వామివారి దర్శనం క్యూ లైన్లలో కూడా భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. రూ.1,500, రూ.రెండు వేల వ్రతాలు ఆలస్యం అవడంతో అక్కడ వేచియున్న భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండపాల లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. క్యూ లైన్లలో మంచినీరు లభించక భక్తులు ఇబ్బంది పడ్డారు. ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నమూనా ఆలయ నిర్మాణానికి టెండర్ ఖరారు

ఆరు నెలల్లో నిర్మాణం పూర్తికి కాంట్రాక్టర్ అంగీకారం



నమూనా ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ తదితరులు (ఫైల్)

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని భక్తులకు శుభవార్త. మరో ఆరు నెలల్లో విశాఖపట్నం-రాజమహేంద్రవరం వైపున జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను దర్శించే అవకాశం కలగనుంది. ఇందుకు స్వామివారి ఆలయం, ఇతర నిర్మాణాలకు ఉద్దేశించిన టెండర్ 3.95 శాతం ఎక్కువగా సుమారు రూ.3.57 కోట్లకు ఖరారైంది. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శనివారం ఈ విషయం తెలిపారు.సత్యదేవుని డిగ్రీ కళాశాల సమీపంలో దేవస్థానానికి గల 70 సెంట్ల స్థలంలో స్వామివారి నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, ఫుడ్ ప్లాజా, టాయిలెట్ బ్లాక్ నిర్మించేందుకు గత నెలలో రూ.3.44 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. టెండర్లను శుక్రవారం తెరిచారు. అంచనా వ్యయం కన్నా 4.95 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్ తక్కువదిగా నిలిచింది. మళ్లీ రివర్స్ టెండర్‌కు వెళ్లగా అదే కాంట్రాక్టర్ 0.5 తగ్గించారు. కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరిపి మరో 0.5 శాతం తగ్గించేలా ఒప్పించడంతో అంచనా వ్యయం కన్నా 3.95 శాతం ఎక్కువ అంటే సుమారు రూ.3.57 కోట్లకు టెండర్ ఖరారైందని ఈఓ వివరించారు. ఈ విషయాన్ని దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఐవీ రోహిత్‌కు చెప్పగా ఆయన మౌఖికంగా అంగీకారం తెలిపారన్నారు. త్వరలో జరిగే ట్రస్ట్‌బోర్డు సమావేశంలో ఈ టెండర్‌ను ట్రస్టీలు ఆమోదించాక కమిషనర్ అనుమతికి పంపిస్తామని తెలిపారు. నమూనా ఆలయాన్ని నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. గతేడాది జూలైలో నమూనా ఆలయం నిర్మాణానికి దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ..ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు స్వామివారి నమూనా ఆలయం నిర్మాణానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని మార్చి 24న సాక్షి దినపత్రికలో 'అదిగో...అల్లదిగో...' శీర్షికన వార్త ప్రచురితమైంది. నవంబరు కల్లా ఈ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ వార్త సారాంశం. సాక్షి పేర్కొన్నట్లుగానే పనులు వేగంగా జరుగుతుండడం విశేషం.

సీఎం జగన్.. ఉద్యోగుల పక్షపాతి


ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కొనియాడారు. ప్రజా సంక్షేమం మాదిరిగానే ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఆయన పరితపిస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత కూడా సీఎం జగన్‌దేనని అన్నారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను 10 ప్రభుత్వ శాఖల్లో క్రమబద్ధీకరించారని తెలిపారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు ఇచ్చేలా చేయడం, 6,840 కొత్త పోస్టులు మంజూరు చేయడం, 12వ పీఆర్సీకి ఆమోదం తెలపడం వంటి వాటి ద్వారా ఉద్యోగుల పట్ల తనకున్న అభిమానాన్ని ముఖ్యమంత్రి జగన్ మరోసారి వ్యక్తం చేశారని వివరించారు. ఈ మేరకు రాష్ట్ర ఉద్యోగుల తరఫున సీఎంకు ఇజ్రాయిల్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం


నిందితులను చూపుతూ మీడియాతో మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్

- కోరుకొండ యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- 8 మంది నిందితుల అరెస్టు
- చాకు, 7 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం

మధురపూడి: యువకుడి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే అతడి హత్యకు దారి తీసిందని నిర్ధారించారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సై కట్టా శారదా సతీష్‌తో కలిసి సీఐ ఉమామహేశ్వరరావు ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. హతుడు ముప్పిడిశెట్టి శ్రీను (34) స్వగ్రామం కోరుకొండ మండలం గాడాల. అతడు కోరుకొండలోని వెంకటగిరి లైటింగ్స్ అండ్ డెకరేటర్స్ సప్లై కంపెనీ యజమాని వెంకటగిరికి అల్లుడు. సప్లై కంపెనీ వ్యవహారాలను శ్రీనే చూసుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి పశ్చిమ గోనగూడెం రోడ్డులోని ఎస్‌ఆర్ నగర్‌లో ఉన్న సప్లై కంపెనీ గోడౌన్ వద్ద గుర్తు తెలియని దుండగులు అతడి కళ్లల్లో కారం చల్లి, పొట్టలో కత్తులతో పొడిచి, పరారయ్యారు. ఆసుపత్రికి తరలించే లోపే శ్రీను మృతి చెందాడు. దీనిపై అతడి మామ వెంకటగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

మూడు నెలలుగా రెక్కీ

కర్నూలు జిల్లా దేవనకొండ గ్రామానికి చెందిన సబ్బు నాగార్జునరెడ్డి అలియాస్ అర్జున్‌రెడ్డి అలియాస్ అర్జున్ అలియాస్ నాగు కోరుకొండలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రస్తుతం రాజానగరంలో నివాసం ఉంటున్నాడు. నాగార్జున రెడ్డితో పాటు ముప్పిడిశెట్టి శ్రీనుకు కోరుకొండ గ్రామానికి చెందిన వివాహిత కాళ్ల నాగలక్ష్మితో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో నాగార్జునరెడ్డితో వ్యవహారాన్ని బయట పెడతానంటూ శ్రీను ఆమెను హెచ్చరించాడు. దీంతో విషయం తన భర్తకు తెలుస్తుందని నాగలక్ష్మి భయపడింది. ఈ విషయాన్ని తన స్నేహితురాలు, కోరుకొండకు చెందిన ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకురాలు ముత్యాల పద్మావతికి చెప్పింది. శ్రీనును హతమారిస్తే తప్ప ఈ సమస్య నుంచి బయట పడలేమని భావించిన వీరిద్దరూ ఈ విషయాన్ని నాగార్జునరెడ్డికి చెప్పారు. దీంతో శ్రీను హత్యకు నాగార్జునరెడ్డి, అతడి మిత్రులు గొడ్డు దిలీప్ (రాజానగరం), చొప్పెల్ల వెంకటేశ్ (రాజానగరం), సయ్యద్ అహ్మద్ (రాజానగరం), ఇంజమూరి రాజేంద్రప్రసాద్ (అనంతపురం జిల్లా గుత్తి – ప్రస్తుతం రాజానగరంలో ఉంటున్నాడు), కొవ్వాడ విజయ్‌కృష్ణ (గుమ్ములూరు, కోరుకొండ మండలం) పథక రచన చేశారు. ఈ నేపథ్యంలో అమెజాన్ నుంచి ఆన్‌లైన్‌లో కత్తి తీసుకున్నారు. మూడు నెలలుగా అదను కోసం వేచి చూస్తున్నారు. రెక్కీ నిర్వహించారు.

వెంబడించి.. హతమార్చి..

గ్రామ దేవత అంకాలమ్మ జాతర సందర్భంగా శ్రీను గత ఆదివారం రాత్రి పశ్చిమ గోనగూడెం రోడ్డులోని సప్లై కంపెనీ గోడౌన్‌కు ఒంటరిగా వెళ్తూ కనిపించాడు. అతడిని నాగార్జునరెడ్డి, గొడ్డు దిలీప్ మోటార్ సైకిల్‌పై వెంబడించారు. గోడౌన్ తలుపు కొట్టి, బయటకు వస్తున్న శ్రీను కళ్లల్లో కారం జల్లారు. నాగార్జునరెడ్డి, వెంకటేశ్‌లు శ్రీను చేతులు పట్టుకోగా దిలీప్ కత్తితో పొడిచి హతమార్చాడు. అనంతరం నిందితులు పరారయ్యారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హతుడు శ్రీను గురించి ఆరా తీశారు. దీంతో వివాహేతర సంబంధం విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ తీగ లాగితే మొత్తం డొంకంతా కదిలింది. నిందితుల సెల్‌ఫోన్ల కాల్‌డేటా, సీసీ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా నిందితులు నాగార్జునరెడ్డి, దిలీప్, వెంకటేశ్, సయ్యద్ అహ్మద్, ఇంజమూరి రాజేంద్రప్రసాద్‌లను రాజానగరంలో అరెస్టు చేశారు. అలాగే కోరుకొండలో నాగలక్ష్మిని, పద్మావతిని, గుమ్ములూరులో కొవ్వాడ విజయ్‌కృష్ణను అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు మోటార్ సైకిళ్లు, ఒక కారు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు, డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై కట్టా శారదా సతీష్, తన సిబ్బందితో వివిధ బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసి, ఈ కేసు మిస్టరీని ఛేదించారు. సాంకేతిక నిపుణుల సహాయం తీసుకున్నారు. వీరిని ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు అభినందించారు.

మరదలిపై హత్యాయత్నం


సత్యనారాయణ (పాత చిత్రం)

- ఆపై రైలు కింద పడి బావ ఆత్మహత్య
- రెండు కుటుంబాల్లో విషాదం నింపిన క్షణికావేశం

నల్లజర్ల: క్షణికావేశంలో మరదలిపై హత్యాయత్నానికి ఒడిగట్టి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతినీడుపాలెంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై శ్రీహరిబాబు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన పెదపూడి సత్యనారాయణ (33) చిన్నతనం నుంచీ పోతినీడుపాలెంలోని మేనమామ ఇంట పెరిగాడు. మేనమామ తన పెద్ద కుమార్తెకు, సత్యనారాయణకు మూడేళ్ల కిందట వివాహం చేశాడు. సత్యనారాయణ 'సాయి శ్రీనివాసా' పేరిట బ్యాండు ట్రూపు ఏర్పాటు చేసి, మేనమామ ఇంట్లోనే నివసిస్తున్నాడు. ఈ ట్రూపులోనే సత్యనారాయణ మేనమామ రెండో కుమార్తె పాటలు పాడేది. ఈ క్రమంలో బావకు, ఆమెకు మధ్య ప్రేమ వ్యవహారం మొదలైందని పోలీసులు చెబుతున్నారు. ఇటీవల ఆమెకు పెళ్లి కుదిరింది. వరుడు కొనిచ్చిన సెల్‌ఫోన్‌లో ఆమె తరచూ మాట్లాడుతూ బావకు దూరంగా ఉంటోంది. తనకు ఆమె దూరమవుతోందని సత్యనారాయణ అక్కసు పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో మాట్లాడే పని ఉందంటూ ఆమెను గ్రామంలోని కానూరి సత్యనారాయణ పామాయిల్ తోటకు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య ఏం జరిగిందో ఏమో కానీ ఆమె మెడపై సత్యనారాయణ కత్తితో పొడిచాడు. చనిపోయిందని భావించి బైక్‌పై అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం చాటపర్రులోని ఉన్న తన సోదరి ఝాన్సీకి ఫోన్ చేశాడు. తన మరదలిని చంపేశానని, తాను కూడా రైలు కింద తల పెట్టి చనిపోతానని, తన గురించి వెతకవద్దని చెప్పి, ఫోన్ పెట్టేశాడు. దీంతో ఝాన్సీ తన బంధువులందరినీ అప్రమత్తం చేసింది. భీమడోలు మండలం కొండ్రుపాడు రైల్వే గేటు వద్ద రాత్రి 11 గంటల సమయంలో రైలు కింద పడి సత్యనారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి బైక్ కూడా అదే ప్రాంతంలో లభ్యమైంది. ఝాన్సీ ఇచ్చిన సమాచారంతో సత్యనారాయణ మేనమామ కుటుంబ సభ్యులు సమీపంలోని అన్ని పామాయిల్ తోటల్లో గాలించారు. రెండు గంటల అనంతరం రక్తపు మడుగులో ఉన్న బాధిత యువతిని గుర్తించి, ప్రత్యేక వాహనంలో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. తన కుమార్తెపై అల్లుడే దురాగతానికి పాల్పడ్డాడని తెలిసి ఆమె తల్లి సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను కూడా ప్రత్యేక వాహనంలో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని నల్లజర్ల సీఐ నున్న రా జు, ఎస్సై నరసింహమూర్తి శనివారం ఉదయం సందర్శించారు. తమ రెండో కుమార్తెకు పెళ్లి కుదిరిందని, ఈ నేపథ్యంలో బ్యాండు ట్రూపులో పాటలు పాడనని చెప్పడంతో అల్లుడు సత్యనారాయణ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశా రు. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల మనస్సుల్ని గెలుచుకున్న సీఎం


హరిధర్‌రావు

కాకినాడ రూరల్: ఇటీవలి క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న గొప్ప నిర్ణయాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల మనసుల్ని గెలుచుకున్నారని ఉత్తరాంధ్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బడగల హరిధర్‌రావు అన్నారు. రమణయ్యపేటలోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 12వ పీఆర్సీ వేయడంతో పాటు సుమారు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని కేబినెట్‌లో నిర్ణయించారన్నారు. అలాగే, కొత్తగా 7 వేల ప్రభుత్వ ఉద్యోగుల నియామకం ద్వారా నిరుద్యోగులకు అవకాశం లభిస్తుందన్నారు. సీపీఎస్ రద్దు చేసి, అందరికీ ఆమోదయోగ్యంగా జీపీఎస్ విధానం తీసుకురావడం ఆనందించదగ్గ విషయమని, ఇటువంటి నిర్ణయాలు చరిత్రాత్మకమని వివరించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మారిస్తే వారి బతుకులు బాగుంటాయని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని హరిధర్‌రావు కోరారు.

టైరు మారుస్తుండగా.. దూసుకొచ్చిన మృత్యువు

- డ్రైవర్ దుర్మరణం
- నలుగురికి గాయాలు

పిఠాపురం: కారు రూపంలో మృత్యువు దూసుకు రావడంతో ఓ వ్యాన్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. గొల్లప్రోలు పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లిగూడేనికి చెందిన పవన్ (30) వ్యాన్ డ్రైవర్. తాడేపల్లిగూడెం నుంచి శుక్రవారం రాత్రి విశాఖకు వెల్లుల్లిపాయల లోడు వేసుకుని వ్యాన్‌పై బయలుదేరాడు. గొల్లప్రోలు మండలం కొత్త వజ్రకూటం సెంటర్ వద్దకు శనివారం తెల్లవారుజామున చేరుకున్నాడు. అక్కడకు వచ్చేసరికి టైరులో గాలి తగ్గిపోయింది. దీంతో వ్యాన్‌ను రోడ్డు డివైడర్ పక్కన ఆపి టైరు మార్చుకుంటున్నాడు. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఇన్నోవా కారు అతి వేగంగా దూసుకు వచ్చి, టైరు మార్చుకుంటున్న డ్రైవర్ పవన్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న విశాఖపట్నానికి చెందిన మాకిన పూర్ణచంద్రరావు, రామలక్ష్మి రమ్య, మారుపల్లి భార్గవి, ఎం.ప్రసాద్ గాయపడ్డారు. వీరందరూ పెళ్లి పనుల కోసం విజయవాడ వెళ్లి వస్తున్నారు. వీరిని బంధువులు మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి.. పవన్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య దాడిలో గాయపడి తాగుబోతు భర్త మృతి

కాకినాడ క్రైం: మద్యానికి బానిసైన భర్తతో ఆమె వేగలేకపోయింది. ఆమె చేసిన దాడిలో గాయపడిన ఆ తాగుబోతు భర్త మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ అవసరాల వారి వీధికి చెందిన తాడి శ్రీనివాస్ (32) స్థానిక బస్టాండ్ సమీపంలోని రామప్ప లాడ్జిలో బాయ్‌గా పని చేస్తున్నాడు. అతడికి లలితతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. మద్యానికి బానిసైన శ్రీనివాస్‌తో వేగలేక లలిత నిత్యం గొడవ పడుతూండేది. భర్త, పిల్లలతో పాటు తన తల్లి, అమ్మమ్మతో కలిసి ఉంటోంది. ఇల్లు మారేందుకు తన సోదరుడు, తల్లితో కలిసి లలిత శనివారం పలుచోట్ల వెతికి తిరిగి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన శ్రీనివాస్ మద్యం తాగి ఇంట్లో పడుకుని ఉన్నాడు. అతడి తీరుతో విసిగిన లలిత కాలితో తన్నింది. ఆమె సోదరుడు కూడా శ్రీనివాస్‌ను కొట్టి ఇంటి నుంచి బయటకు పంపించేశాడు. కొంత దూరం వెళ్లిన అతడు సమీపంలోని చెట్టు కింద కుప్పకూలి చనిపోయాడు. స్థానికులు శ్రీనివాస్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. తగలరాని చోట దెబ్బ తగలడంతో అతడు చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. లలితపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గౌతమీ గోదావరిలో యువతి మృతదేహం

తాళ్లరేవు: గౌతమీ గోదావరిలో గోవలంక వద్ద శనివారం గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ కథనం ప్రకారం.. సుమారు 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతి మృతదేహం ఉదయం కనిపించినట్టు గోవలంక వీఆర్‌ఓ కోరింగ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సుమారు 5.5 అడుగుల ఎత్తు, చామన ఛాయలో ఉన్న ఆ యువతి ఎరుపు రంగు లెగ్గింగ్, గులాబీ రంగు టాప్ ధరించి ఉంది. మృతురాలి కుడి చేతిపై ఒకవైపు 'శివ' అని, మరోవైపు 'అమ్మ' అని పచ్చబొట్లు ఉన్నాయి. మృతురాలి వివరాలు తెలిసిన వారు కోరింగ పోలీస్ స్టేషన్‌లో నేరుగా లేదా 0884-2303533, 94407 96558 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై కోరారు.